అరకు వేలీ డెవలప్‌మెంట్ మొదలిడిన రోజులవి. అంటే, ఆంధ్ర రాష్ట్రము కూడా ఏర్పడకముందు. మద్రాసు-హౌరా మెయిలు నుండి ఒక అమ్మాయి వాల్తేరు స్టేషనులో దిగి, చకచకా బయటకు సామానుతో వచ్చి, రిక్షావానిని అరకు వేలీకెంత తీసుకుంటావని అడిగి, బేరమాడి పెట్టె, బెడ్డింగు రిక్షాలో పెట్టించుకుంది. కొద్ది దూరములోనే వున్న నాకామె మాటలు వినిపించినందున దగ్గరకు నడిచి "అరకు వేలీకేనా వెళ్ళ మన్నది?" అని ఆమె నడిగేను. వయస్సునుబట్టి నన్ను

# కాలమ్ దాటని కథ

'రోడ్ సైడ్ రోమియో'గా శంకించి, "తమరి కెందుకు అనవసర ప్రసంగము?" అని గద్దించింది. "ఆమె ఎక్కడకు తీసుకువెళ్ళమన్నారో సరిగా విన్నావా?" అని రిక్షావానిని అడుగుతే, "వేలీ గార్డెను అంటే లోవ్వతోట కాదా? బాబూ నాకా మాత్రము తెలియదా" అన్నాడు.

## అరకు వేలీ వయా వాల్తేరు ఆర్.ఎస్.

"అమ్మాయిగారూ! మీకు మరల రెట్టింపు కోపము రావచ్చును. కాని, సంస్కృతితోపాటు 'షివల్రీ' అలవరచుకున్న నేను, ఆడువారు అనవసరంగా అగచాట్లు పడబోతుంటే ముభావంగా ఊరుకొనలేను. నా శ్రవణేంద్రియాల కింకా జాడ్యము పట్టనందున, మీరు అరకు వేలీ అన్నట్లు నాకు ఖచ్చితముగా జ్ఞాపకము. ఆ ప్రదేశ మిక్కడికి డెబ్బయి మైళ్ళ దూరమున వున్నది. వారానికి బస్సు ట్రిప్పులు మూడు. ఇవాళ పొద్దున్న బస్సు వెళ్ళినందున, ఎల్లుండి పొద్దున్నకు కాని ఆ వూరికి బస్సు లేదు" అని చెప్పేను.

చేతులు జోడించి, అజ్ఞానముతో నాపట్ల చూపెట్టిన అమర్యాదకు క్షమించమని మరీమరీ వేడుకుని, "అరకు వేలీ వయా వాల్తేరు ఆర్.ఎస్." అనే చిరునామాతో స్కూలు టీచరు పని ప్రకటన చూసి, వాల్తేరు స్టేషనుకు ఏ నాలుగైదు మైళ్ళో వుండవచ్చునని ఊహించేను. బెజవాడకు మా గుణదలలాగా ఇటు కంట్రీ లైఫూ, అటు పట్నం ఫెసిలిటీస్ అనుభవించవచ్చుననే అపోహతో దరఖాస్తు పెట్టి, పనికి ఆర్డరువస్తే ఉత్సాహముతో బయలుదేరాను. మీ మేలు ఎప్పటికీ మరిచిపోనని ధన్యవాదాలు మరోసారి చెప్పి, కూలీని పిలిచి బుకింగు కౌంటరు వైపు నడిచింది 'అప్' మెయిలులో తిరుగుప్రయాణమునకు.

—వి.ఆర్.తాతా




శ్రావణ మేఘాలు వ్యాస రచన పోటీలో
రెండవ బహుమతి సుమీత్ మిక్సీ పొందిన రచన

## స్త్రీ స్థానాన్ని దిగజార్చే ముగింపు

అనేక పాత్రల్ని సన్నివేశాలని సృష్టించి కథ ముందుకి నడిపే రచయిత్రి— శాంతి తన కథనే సరైన మార్గంలో నడపలేకపోయిందని చెప్పక తప్పదు. ఆమెను విధి నడుపుతుందని సరిపెట్టుకోవడం సమంజసం కాదు.

ఆమె కథకి ఆత్మహత్య ముగింపు కారాదు. అందునా ఒక అభిమాని సలహాపై తన స్వంత అభిప్రాయాన్ని కాలదన్ని— ఆత్మహత్యనే ముగింపుగా చెయ్యడం అసహజంగా వుంది.

అనేక సమస్యలకి పరిష్కారం చూపుతూ సమాజాన్ని ముందుకు నడపవలసిన ఒక రచయిత్రి— సాధారణ అమాయక స్త్రీలా తన సమస్యకి ఆత్మహత్యే శరణ్యంగా భావించి ముగించడం శోచనీయం. అదీ ఒక అభిమాని సలహాపైన.

శాంతికి భర్త ఏ తప్పూ చెయ్యలేదనీ తననే ఆరాధిస్తున్నాడనీ తెలుసు. తప్పనిసరి పరిస్థితిలో లలితని వివాహం చేసుకున్నాడనీ తెలుసు. లలిత కోరికపై వారి దాంపత్యాన్ని సరిచేయడం కోసం— భర్త అక్కర్లేదని తెగతెంపులు చేసుకున్న మొదటి భార్య కోసం బాధపడవద్దని రాఘవతో చెప్పింది. అంత ధైర్యంగా నిబ్బరంగా వున్న శాంతి ఒక అభిమాని సలహాపై ప్రాణప్రదమైన కొడుకుని లలితకి అప్పగించాలనుకోడం— అతడికి దూరంగా తను బ్రతకలేనని ఆత్మహత్య చేసుకోవడం అవివేకం. రాఘవ గాని, లలిత గాని వారికి తను బాబునిమ్మని అడగలేదు. అటువంటప్పుడు తను బాబుని వారికి ఇవ్వవలసిన అవసరమూ లేదు. ఆత్మహత్య చేసుకోవలసిన అవసరమూ లేదు.

భర్త మంచి మనసు తెలిసింది. తననే ఆరాధిస్తున్నాడని తెలిసింది. అంతకన్నా శాంతికి కావలసిందేముంది? జీవితాంతం స్నేహితులుగా వుండిపోవచ్చు. రాఘవకి ఎటూ అతడి వృత్తితో తీరిక వుండదు. తను తన రచనలతో సమాజాభివృద్ధికి పాటు పడవచ్చు. లలిత మీద కూడా తనకి ద్వేషం పోయింది. అటువంటప్పుడు పశ్చాత్తాపమే తను చేసిన పొరపాటుకి శిక్షగా భావిస్తూ బాబుని భావి పౌరుడిగా తీర్చిదిద్దుతూ తన కథల ద్వారా సమాజానికి సేవ చేస్తూ లలితా రాఘవంకి స్నేహితురాలిగా వుండడమే కథకి ముగింపుగా వుంటే బాగుండేది. ఇది రెండవ పద్ధతి.

ఇంతకన్నా మంచిగా ముగించవచ్చు. డాక్టరు రాఘవపాత్ర కొంత వరకూ ఉదాత్తంగా చిత్రించబడినా— ఒకచోట తప్పటడుగు వేసిందని చెప్పక తప్పదు. రాఘవకి శాంతిమీద ఎనలేని ప్రేమ, ఆరాధన వున్నాయి. లలితని తన వృత్తి ధర్మంగా చేరదీశాడు. ఆమె మీద అతడికి జాలి తప్ప ఎటువంటి ప్రేమ భావం లేదు. కాని, లలిత తన మీద ప్రేమని పెంచుకుంటోందని శారద ద్వారా తెలుసుకున్నాడు. లలిత ప్రవర్తన ద్వారా అది నిజమని గ్రహించాడు. ఆమె ఏదో చెప్పాలనుకుని చెప్పలేక ఏం చెప్పాలనుకుంటోందో అడిగి తెలుసుకోవచ్చు కదా!

వృత్తి ధర్మం అంటూ ఆమెని స్కూటరు మీద ఊరు తిప్పాల్సిన అవసరం లేదే! భార్య ఎంతో ప్రేమతో గుడికి రమ్మని వేడుకుంటే పెడ చెవిని పెట్టే భార్య మీద ప్రేమ వున్న భర్త పర స్త్రీతో షికారు తిరుగుతాడా? అప్పుడే తనకి పెళ్ళైందని— భార్యంటే తనకి అభిమానమని లలితతో చెప్పి ఆమెకి ఆశలు కల్పించకుండా వుండవచ్చు. కేవలం శారద సలహాపై అతడు ఆ విషయం ఆమెతో చెప్పలేదని రచయిత (త్రి) అభిప్రాయం. విద్యుక్తధర్మం తెలిసిన డాక్టరు— భార్యని అమితంగా ప్రేమించే డాక్టరు— భార్య కోరికని కాదని వృత్తిధర్మం అంటూ గృహస్థ ధర్మాన్ని వదిలి ఒక పేషెంటుని వెంటపెట్టుకు తిరిగి ఆమెలో ఆశలు రేపడు. లలిత ఆరోగ్యం బాగుపరచడానికి అమెరికా తీసుకెళ్ళడం కోసం తనకి ఏమాత్రం ప్రేమలేని ఆమెని పెళ్ళి చేసుకోవాల్సిన అవసరం లేదు. ఆమె ఆరోగ్యం బాగుచేయించి— ఆమెకి మరొక మంచివాడితో పెళ్ళి జరిపించవచ్చు. అప్పుడు భార్య మనసు తెలిసిన రాఘవ ఆమెని, బాబుని స్వీకరించినట్లు ముగించివుంటే కథకి ఎంతో న్యాయం జరిగేది.

రచయిత (త్రి) చేసిన ముగింపు వల్ల ఈనాటి సమాజంలో ఎందరో రెండవ పెళ్ళి చేసుకునే మహానుభావులకి ప్రోత్సాహమిచ్చినట్లయింది. ఇటువంటి ముగింపుల వల్ల సమాజంలో స్త్రీ స్థానం మరింత అడుగంటి పోవడం ఖాయం. ఎందరో అమాయకులలో విష బీజాలు నాటేవి నేటి ఇటువంటి సినిమాలే!

ఇకపోతే ఈ నవలలో నన్ను ఆకట్టుకున్న సంఘటన శాంతి రాఘవతో లలిత తరపున వారి సంసారం బాగు కోసం— తను రాఘవ భార్యనని తెలియనీయకుండా— అన్న మాటలు మెచ్చుకోతగ్గవి. ఆ మాటలలో తను చేసినదే తప్పని అతడి తప్పు లేదని పశ్చాత్తాపం ఇమిడి వుంది. రాఘవకి మాత్రం తెలిసేలా వున్నాయా మాటలు. "మీరు చెయ్యని తప్పులకి మిమ్మల్ని దుర్భాషలాడింది, కాపురం చేసినంతకాలం మిమ్మల్ని కాల్చుకు తింది" అని తను చేసిన తప్పులు భర్త దగ్గర చెప్పుకుంటున్నట్లుగాను, లలితకి మాత్రం మొదటి భార్యని తిడుతున్నట్లుగాను అర్థమౌతాయి.

—శ్రీమతి ఆర్.ఎస్.హైమవతి,
మద్రాసు.